# కథ కంచికి

మూర్తి సీటులో కూర్చోగానే క్రితంరోజు కనిపించని కేసు గుర్తొచ్చింది. అది ఏమైనా ఈరోజు వెతికి పట్టుకోవాలి. అసలు ఎలా పోయిందో అర్థం కావడంలేదు. ప్యూనుని అడిగినా లాభంలేదు. ఇక్కడ అక్కడ చూసి 'లేదుసార్' అనేస్తాడు. నిజాయితీగల ఏ ఉద్యోగి అయినా తనకి కావలసిన పేపరు ఏది కనిపించక పోయినా తనే స్వయంగా వెతుక్కోవాలి. మూర్తి చాలా వినయ విధేయతలు, నిజాయితీ గల గుమాస్తా.

అందుకే అతను మరింక ఆలోచించకుండా రికార్డు రూముకేసి నడిచాడు. ఆ రికార్డురూముకి ఆలనా పాలనా లేదు. అందులో కాగితాలు-

ఫైళ్ళు - కేసులు _ స్టాక్ ఫైళ్ళు ఒకటేమిటి అన్నీ గుట్టలుగా పోసి వుంటాయి. అందులో ఏమేమి వున్నాయో ఎవరూ చెప్పలేరుగాని పాములూ తేళ్ళూ కరవకుండా చూచుకోమని అందరూ చెప్తారు.

మూర్తి లోపలికి అడుగుపెట్టాడు. నిలువెత్తున నిలబెట్టిన చెక్క షెల్ఫులలో ఎన్నో కేసులు వున్నాయి. కొన్ని దారంతో కట్టి, కొన్ని కట్టక, మరికొన్ని మూడువంతులు క్రిందకు వ్రేలాడుతున్నాయి. అతడు ఒక్కొక్కటే చూసి మళ్ళీ పెట్టేస్తున్నాడు. చేతినిండా మట్టి మరకలు అవుతున్నాయి పైపైన చూసి ఎందులో కలసి వుంటుందో అంచనా వేద్దామనే ఆలోచనలో అటూ ఇటూ చూస్తున్నాడు.

ఇంతలో టప్‌మని ఒక బరువైన పదార్థం అతని తలమీద పడి భుజాలమీదిగా కిందకి దూకింది. మూర్తి కెవ్వుమని అరిచాడు. పక్కకి తిరిగి చూశాడు. పోతులాంటి బల్లి. అది సామాన్యంగా ఇళ్ళలో వుండే బల్లికి మూడురెట్లు పెద్దదిగా వుంది. మూర్తి గడగడ వణికిపోయాడు. బల్లి మీదపడడం అతనికి చాలా అశుభంగా అనిపించింది. అసలే అతడు బల్లిని గురించి వారంరోజులక్రితమే చాలా చదివాడు. శిరస్సు మీద బల్లి పడితే ఏమిటి? అది కుడి భుజం మీదనుండి జారిపోతే యేమిటి? కనబడని కేసు గురించి దేవుడెరుగు. మూర్తి మాత్రం ఒక్క అంగలో బయటపడ్డాడు. అక్కడే వున్న ఆంజనేయులు "ఏమిటిగురూ" అంటూ పలకరించాడు అతని కంగారు చూసి.

"అబ్బే ఏమీలేదు, బల్లి" అన్నాడు. భయంతో అతని కంఠం కీచుగా వచ్చింది.

ఆంజనేయులు ఫెళ్లున నవ్వి "నయం, పాము కానందుకు సంతోషించు" అన్నాడు.

మూర్తి, ఆంజనేయులు వేసిన జోక్ అరిగించుకునే స్థితిలో లేడు.

బల్లిని గురించి తను చదివినవన్నీ మననం చేసుకుంటున్నాడు. ఎలాగైనా ఈ కీడు పోయేమార్గం చూడాలి. అంటే తను కంచి వెళ్ళాలి. తను వెంటనే వెళ్ళగలడా? పోనీ కంచివెళ్ళి అక్కడ బంగారుబల్లి, వెండిబల్లి, మట్టిబల్లి అన్నిబల్లులూ తాకినవారిని వెంటనే ముట్టుకుంటే ఆ కీడు పోతుందంటారు. అయితే వెంటనే కంచివెళ్ళి వచ్చిన వారికోసం చూడాలి. ఆఫీసులో బాహాటంగా అడిగితే అందరూ నవ్వుతారు. తన అటపట్టిస్తారు అసలే సగానికి పైగా నాస్తికులు. ఇలాంటి నమ్మకాలంటే మరీ గొడవచేసిపారేస్తారు. కాబట్టి తెలివిగా విషయం రాబట్టాలి.

తలవంచుకుని పని చేసుకుపోతున్న ప్రసాద్ దగ్గరికి వెళ్ళి "ఏమోయ్ ప్రసాద్! మొన్న తిరపతి వెళ్ళినపుడు ఎక్కడెక్కడికి వెళ్ళావేమిటి?" అన్నాడు మూర్తి లౌక్యంగా.

"ఎక్కడికి వెళ్ళడానికైనా టైమెదీ? పెట్టింది ఒక్కరోజు లీవు. కలిసింది ఒక్క ఆదివారం. తిన్నగా కొండకి వెళ్ళి దేవుడిని చూసి వచ్చేశాము" అన్నాడు.

"అయితే కాళహస్తి వెళ్ళలేదన్నమాట" అన్నాడు మూర్తి ముందే కంచి గురించి అడిగితే బాగుండదని.

"కంచీలేదు, కాళహస్తీ లేదు" అన్నాడు ప్రసాద్ స్తిమితంగా.

అయితే ప్రసాద్‌తో లాభంలేదు అనుకున్నాడు మూర్తి. మూడు సీట్లకి అవతల కూర్చున్న వరలక్ష్మి ఈ మాటలు విని -

"అదేమిటండీ కంచివెళ్ళకుండా వచ్చారా? కామాక్షి విగ్రహం ఎంత అందంగా వుంటుందో" అంది.

"మీరు వెళ్ళారా" అన్నాడు మూర్తి అర్థంలేని ఆశతో.

"ఆ.... ఎప్పుడో వెళ్ళాను" అంది.

"అక్కడ విశేషాలేమిటండీ"

"ఏమున్నాయి? బల్లులు వుంటాయి. వాటిని తాకితే దోషం ఉండదంటారు"

"మీరు వాటిని తాకారా?"

"ఆ... ఏదో పెద్దవాళ్ళకోసం"

ఆ క్షణంలో మూర్తిలో సంఘర్షణ మొదలయింది. తనొక్కసారి వరలక్ష్మిని ముట్టుకుంటే తన దోషం పూర్తిగా పోతుంది. కాని అదెలా సాధ్యం? ఆమె ఎంతో మంచిపిల్ల. అమాయకురాలు. తనంటే ఎంతో గౌరవం వున్న మనిషి. వెకిలివేషాలు వేసి ఆమెదగ్గర తన పరువు మంట కలుపుకోలేడు. మరేం చేయాలి?

వరలక్ష్మి కడకొంగు తగిలితే చాలు. ఈ కీడు పోతుందని అతడు ఆరాటపడిపోయాడు.

క్షణక్షణం అతని మనసులో బల్లిపాటు కలహానికి, అనారోగ్యానికి, ఆర్థిక ఇబ్బందులకి. అపనిందలకి, అష్టకష్టాలకి ఎలా సూచనలిస్తుందో గుర్తుకొస్తోంది

మూర్తికి కనబడని ఫైలు దొరకలేదు గానీ, మనోవ్యాధి పట్టుకుంది. ఇంతలో ఆఫీసరుగారు పిలుస్తున్నట్టు కబురొచ్చింది.

ఆ కేసు గురించే అయ్యుంటుంది అని మనసులో ఊహించగానే మూర్తికి ముచ్చెమటలు పోశాయి. చేసేదిలేక అయ్యగారి గదిలోకి అడుగు పెట్టాడు. ఆఫీసరుగారికి నిన్నటికేసు గుర్తు లేదుగాని ఒక టిక్కెట్లపుస్తకం మూర్తికి ఇచ్చి "అందరి దగ్గరా అయిదేసి రూపాయలు తీసుకో" అన్నారు.

అర్థంకానట్టు చూస్తుండిపోయాడు అన్యమనస్కుడైన మూర్తి.

"కంచి కామాక్షిదేవి ఆలయం బాగుచేయించడం కోసం నిధులు పోగుచేస్తున్నారు. పుణ్యకార్యంలో పాలుపంచుకుంటే పుణ్యమే. చెయ్యవయ్యా చెయ్యి" అన్నారాయన.

వెదకబోయిన తీగె తగిలినట్లనిపించింది మూర్తికి. ఆఫీసరుగారు కంచి వెళ్ళివుంటారు. నిజం. ఆయన వెళ్లేవుంటారు. పోనీ ఆయనతో ఈ విషయం చెప్తే —ఛీ—ఇంకానయం—ఆయన నన్ను పట్టి జడ్డివాడిలాగా అంచనా వేస్తారు. ఆఫీసర్ల దగ్గర ఒక్కసారి ఇంప్రెషన్ పోతే మరిరాదు. ఒకవేళ ఆయన కంచివెళ్ళినా ఆయన్ని తనెలా తాకగలడు? అసలా విషయం ఎలా అడగ గలడు? తనకీ, ఆయనకీ కొన్ని యోజనాల దూరం వుంద. కొన్ని అగాధాల ఎడం వుంది. ఇది అసాధ్యం. ఆయన ఎంతో దగ్గరగా వున్నారు. ఒక్కసారి కనీసం మునివేళ్ళు తాకినా చాలు. దరిద్రగొట్టు ఫైలు కనిపించినా బాగుండేది. అది చూపిస్తున్నట్లు నటించి, ఆయన చేయి తాకి, ఈ మనోవ్యాధినుంచి బయట పడేవాడు. పోనీ ఆయన టేబుల్‌మీద ఒక్క పేపరయినా లేదు. ఏదయినా చూపించినా, చూసే వుద్దేశ్యం వున్నట్లు ఆయన కనబడడంలేదు. ఇప్పుడేమిటి గతి?

"ఓకే మూర్తీ - అందరికీ యిచ్చెయ్, కలక్షన్ ఫస్టుకి వచ్చేట్టు చూడు" అంటూ ఆయన లేచారు.

ఆఫీసు మొత్తంలో మూర్తికి కంచికి వెళ్ళినవారు తోటిక్లర్కు వరలక్ష్మి, ఆపీసరుగారు ఇద్దరే కనిపించారు. ఇద్దరూ తనకి అందని, అందరానివాళ్ళే. కలహం వస్తుంది. బల్లి నెత్తిమీద పడింది. ఎవరితోనూ అధికంగా మాట్లాడకూడదు. ఇంకేమైనా వస్తుందేమో! చెవుల్లోంచి వేడిగా హోరు వస్తున్నట్లుంది - కళ్లుమంటలు - జ్వరం రాదుగదా! ఇంక ఆగలేక

"వరలక్ష్మిగారూ! బల్లి మీదపడితే ఏం చేయాలండీ" అన్నాడు తెగించి.

"సింగినాదం. ఏమీకాదండీ, తినేపదార్థాలలో పడితే మాత్రం విషం. చచ్చిపోతాం" అంది తేలిగ్గా తీసిపారేస్తూ.

నెత్తిమీద పడితేనే తను అశాంతితో చచ్చిపోతున్నాడే. ఇంక అన్నంలోకూడా పడాలా అనుకున్నాడు మూర్తి. రహస్యంగా ఎవరినైనా అడుగుదామంటే, అది వాళ్ళు టాంటాంచేసి, నానా అల్లరీ చేసి మర్నాటి నుంచి తన పేరే బల్లిగా మార్చేయగలరు. అది మూర్తికేం కొత్తకాదు. నిమిషాలు, గంటలు అశాంతిగానే గడిచిపోయాయి. పోయిన ఫైలు దొరక లేదు. వెంటనే కంచిప్రయాణం కట్టలేడు కనుక కంచి వెళ్ళివచ్చిన వారి కోసం వేటాడుతూ, మరెవర్నీ ఇంతలో తాకకుండా అయిదుగంటల వరకు గడిపాడు మూర్తి.

అశాంతిగానే ఇంట్లో అడుగుపెట్టి ఎదురొచ్చిన భార్యని చూసి గతుక్కుమన్నాడు మూర్తి. ఇప్పుడేం చెయ్యాలి? ఆపీసులో అందరికీ అలా అలా దూరంగా గడిపేశాడు. ఇక్కడెలా? అనుకుని ఒక్కక్షణం ఆలోచించి "బల్లి మీదపడితే ఏం చెయ్యాలి" అన్నాడు సూటిగా, చేసేది లేక.

"కంచి వెళ్ళివచ్చిన వారిని తాకితే పోలంటారు. ఏం? మీమీద పడిందా? నేను చిన్నప్పుడు మా నాయనమ్మతో కంచి...." ఆమె మాటలు పూర్తికాకుండానే మూర్తి ఆమెను గట్టిగా కౌగలించేసుకున్నాడు. ఇన్నాళ్ళుగా ఈ విషయం వాళ్ళమధ్య రానందుకు బాధపడ్డాడు.

కథ కంచికి వెళ్ళిందిగానీ, మూర్తి మాత్రం ఆ రోజు ఇంట్లోనే వుండిపోయాడు.

●